# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి  అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## శోభన్‌బాబు

## ( 1966 ఆగస్టు సంచిక విజయచిత్ర నుంచి)

**భక్త శబరి చిత్రం** షూటింగ్‌లో వున్నప్పుడే "ఒక కొత్త అబ్బాయి ఈ చిత్రంలో బాగా నటిస్తున్నాడు" అని పరిశ్రమలో చెప్పుకున్నారు. మొదటి చిత్రంలోనే అతనికి మంచి అవకాశం లభించింది. ఆ అవకాశాన్ని అతను నిలబెట్టుకోవడం కోసమే శ్రద్ధగా నటించి – "శోభన్‌బాబు బాగానే చేశాడు" అనిపించుకున్నాడు. ఈ పాత్రకోసం శోబన్‌బాబు అంతగా ఎదురుచూడలేదు  వెతకనూలేదు. ఆ పాత్రే అతన్ని వెతుక్కుంటూ వచ్చింది. ఎంచేతంటే, ఆ చిత్ర నిర్మాతలు ఆ పాత్రను ఎవరికిద్దామా అని ఆలోచనలో పడ్డారు పాత్రకు తగ్గ మనిషికోసం వెతికారు కూడా. ఏమైనా, శోభన్‌బాబు అదృష్టవంతుడు. సినిమాల్లో వేషాలు వెయ్యాలనే సంకల్పంతో అతను అప్పటికే మద్రాసు వచ్చి నిర్మాతలనూ దర్శకులనూ చూస్తున్నాడు. 'అవకాశం' అనేది చెప్పి రాదు. అది ఎలా వస్తుందో కూడా ఎవరూ



ఊహించలేరు. ఆ అవకాశం కోసమే అప్పుడతను నిరీక్షిస్తున్నాడు. అదే అతనికి ఎదురైంది. చిన్నతనంనుంచే శోభన్‌బాబుకు సినిమాలన్నా నాటకాలన్నా పిచ్చి. సినిమాల్లో వేషాలు వెయ్యాలన్న సంకల్పం చిన్నప్పుడే లేకపోయినా సినిమాలు మాత్రం తెగచూసేవాడతను. వీలు దొరికినప్పుడల్లా నాటకాల్లో వేషాలు వేసేవాడు. అతని పదమూడో ఏటే ఒక వృద్ధ పాత్ర వేసి అవుననిపించుకున్నాడు. గుంటూరు కళాశాలలో పట్టభద్రుడైన తర్వాత సినిమాల్లో వేషాలకోసం బయల్దేరాడు. ఆ బయల్దేరటం దేన్నో గుడ్డిగా నమ్మికాదు. కేవలం దీక్షతోనూ గుండె నిబ్బరంతోనూ బయల్దేరాడు. గట్టిగా కృషి చెయ్యాలన్న పట్టుదలతోనూ కార్యదీక్షతోనూ బయల్దేరాడు. ప్రయత్నం చేసే మానవుడికి సాధ్యం కానిది లేదని అతని విశ్వాసం. ఈ విశ్వాసమే అతన్ని 'శబరి' తర్వాత 'సీతారామ కల్యాణం' 'తిమ్మరుసు' 'నర్తనశాల' మొదలైన చిత్రాల్లో 'బుక్' చేయించింది. 'నర్తనశాల'లో అభిమన్యుడి పాత్ర 'వీరాభిమన్యుడి' పాత్రకు మార్గ దర్శకత్వం వహించింది. నవరసభరితమైన 'వీరాభిమన్యుడు' పాత్రలో జీవించడానికి శోభన్‌బాబు అహోరాత్రులూ దర్శకుడు చెప్పినట్టు కృషి చేసాడు. అతని కృషి ఫలించింది. చిత్రం చూసినవాళ్ళు అతన్ని ఏకగ్రీవంగా అభినందించారు. 'అభిమన్‌బాబు' అని పేరు మార్చారు. స్కూల్లోనూ కాలేజీలోనూ ఎప్పుడు సంపాయించని మార్కులు సంపాయించాడు అతను 'వీరాభిమన్యు'లో. 'వీరాభిమన్యు' ఐన తర్వాత అతనికి చాలా చిత్రాలొచ్చాయి. అన్నింటిలోనూ నటించడానికి వ్యవధి చాలక, కొన్ని వదులు కోవలసి వచ్చింది కూడా.

'లోగట్టు పెరుమాళ్ళుకెరుక 'లో స్టంటు హీరోగా కూడా పేరు తెచ్చుకుని 'పొట్టిప్లీడరు' లో రెండు పాత్రలు ధరించి మంచినీ చెడునూ కూడా చక్కగా పోషించాడనిపించుకున్నాడు. ఇప్పుడు 'రక్తసిందూరం'లో తండ్రిగానూ కొడుకుగానూ నటిస్తున్నాడు. 'ఉల్లాసపయనం' అనే తమిళ చిత్రాధారంగా తెలుగులో రాబోతున్న చిత్రంలో కూడా ద్విపాత్రాభినయం చెయ్యబోతున్నాడు. తాను చెయ్యడం ఎలావున్నా రకరకాల పాత్రలు లభ్యమైతే చెయ్యాలనీ, చెయ్యవలసినదీ, నేర్చుకోవలసినదీ ఇంకా ఎంతో వున్నదనీ, తాను చేస్తున్నది చెప్పినదాంట్లో నూరోవంతనీ అంటాడు అతను వినయ విధేయతలతో. శ్రీకాంత్ ప్రొడక్షన్స్ వారి సాంఘికం, ఇందిరా రమణా వారి జానపదం, 'కాంభోజరాజు' చిత్రాల్లో శోభన్‌బాబు ప్రస్తుతం నటిస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం భవిష్యత్తు కోసం కలగన్న వాడికి ఇప్పుడు కలలోనే భవిష్యత్తు కనిపిస్తున్నది.

Post your comments